జర్నలిస్ట్ వార్త



# ప్రభుత్వ పాఠశాలలే నాణ్యమైన విద్యకు నాంది

## ప్రైవేట్ స్కూళ్లకు బై- గవర్నమెంట్ స్కూళ్లకు హై




**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ పాఠశాలలలోనే నాణ్యమైన విద్య అందిస్తారని బావుపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎల్. మనోహర్ నాయక్ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో జెండా ఊపి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మనోహర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల గురించి వివరిస్తూ ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ అందజేస్తున్నామని తెలిపారు. అదనంగా పౌష్టికాహారంగా వారానికి మూడు రోజులు గుడ్లు, రెండు రోజులు రాగి జావా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి?ంటికీ వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరయ్య చారి, ఉపాధ్యాయులు ముకుంద రెడ్డి, శ్రీధర్, ఎం. రవికుమార్, పబ్బు రాజు, అనిత, శారద, ప్రభ, సునీత, రాధిక, పీఈటీ సుధాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పనితీరుపై కఠిన సమీక్ష

## బడిబాట, లెర్నింగ్ ప్రోగ్రామ్‌ల పురోగతిపై దృష్టి





**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలంలోని ఉన్నత, ఉన్నత ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వార్షిక అకడమిక్ సమీక్ష సమావేశం స్థానిక జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్)లోని టీచింగ్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగింది. సమావేశానికి మండల విద్యాధికారి డా. బి. రామ్‌ధన్ అధ్యక్షత వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, కే.బి. ధర్మ ప్రకాశ్ సమన్వయంతో జరిగిన ఈ సమావేశంలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగమైన బడిబాట నమోదు కార్యక్రమం పురోగతిపై ప్రతి పాఠశాల హెచ్ఎంలు వివరాలు సమర్పించారు. లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్, ఫంక్షనల్ న్యూమరికల్ లిటరసీ అమలుపై డా. రామ్‌ధన్ సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల డేటా సమర్పణ, బోధన నాణ్యతపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చి, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. వేసవి సెలవుల్లో పాఠశాల ఆస్తులు, రికార్డుల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. సమావేశంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పద్మ, రణూప పాల్గొన్నారు.

# బయ్యారం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన.



**బయ్యారం/,ఏప్రిల్ 22.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో ముస్తఫా నగర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారి పిల్లలకు అన్నప్రాసన,గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్గులోతు శాంతి కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మురుకులు,గ్రుడ్లు, బాలామృతం,పండ్లు,పౌష్టికహారం సమతుల్య ఆహారం తీసుకోవడం వలన పిల్లలు,గర్భిణీ మహిళలు బాలింతలు,బాలికలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి,ఉప సర్పంచ్ ఉమ వార్డ్ మెంబర్ జానీ,ఐసిడిఎస్ కార్యకర్తలు విజయలలిత,ఉపేంద్ర, పద్మ,కమల,లలిత,స్వప్న,పిల్ల తల్లులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తికి ఎస్సై గా నర్సింగరావు



**ఎల్కతుర్తి/ధర్మసాగర్, ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన నర్సింగరావు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌కు ఎస్సైగా బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ మార్పు చోటుచేసుకుంది. ధర్మసాగర్‌లో సేవలందించిన నర్సింగరావు ఎల్కతుర్తిలో త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. స్థానికంగా చట్టవ్యవస్థను బలోపేతం చేయడంపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం.

# రామచంద్రపురంలో చలివేంద్రం ఏర్పాటు.



**బయ్యారం/,ఏప్రిల్ 22.(జర్నలిస్ట్ వార్త)**
వేసవి కాలం ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు రామచంద్రపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ వనిత మంగీలాల్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అత్యవసరం అయితే తప్పా బయటకు రావొద్దని సూచించారు. వాహనదారులు, కూలీలు, ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తొట్టి కృష్ణ,వార్డు సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం అంగన్వాడీలో అన్న ప్రసన,అక్షరాభ్యాసం.

**బయ్యారం/,ఏప్రిల్ 22.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలం రామచంద్ర పురం గ్రామపంచాయతిలో అంగన్వాడి కేంద్రంలో బుధవారం పోషణ పక్షంలో భాగంగా అన్న ప్రసన,అక్షరాభ్యాసం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు సర్పంచ్ వనిత మంగీలాల్ తెలిపారు. పిల్లలకు పుట్టిన 6 నెలల తర్వాత అన్న ప్రసన, అదేవిధంగా 2 సంవత్సరముల 11 నెలల తర్వాత అక్షరాభ్యాసం చెయ్యాలనే లక్ష్యంతో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. పోషకాహార లోపాల్ని నివారించుట పిల్లల సంపూర్ణ ఆరోగ్య అభివృద్ధిలో భాగంగా పోషణ పక్షంలో భాగంగా కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి అంగన్వాడీ టీచర్లు జగదాంబ, మమత,సారమ్మ,సరిత,పార్వతి,అరుణ,కృష్ణకుమారి,ఆశ వర్కర్లు వార్డ్ మెంబర్లు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థమే శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు.






**బయ్యారం/,ఏప్రిల్ 22.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల ప్రజల సౌకర్యార్థం తహాశీల్దార్ కార్యాలయం శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తహాశీల్దార్ నాగరాజు తెలిపారు. బుధవారం తహాశీల్దార్ కార్యాలయంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని నిర్వాహకురాలు ప్రేమలత, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఉపేందర్,సందీప్,వెంకన్న లతో కలిసి తహాశీల్దార్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కు సంబంధించిన మార్పులు చేర్పులకై ఇక్కడ ఆధార్ నమోదు, నవీకరణ,ఫోటో అప్‌డేట్లు,మొబైల్ నంబర్ లింక్ వంటి సేవలను పొందవచ్చని తహాశీల్దార్ తెలిపారు. ప్రజలు తమ ఆధార్-సంబంధిత పనులను ఇక్కడే పూర్తిచేయగలిగే అవకాశముందని తహాశీల్దార్ తెలిపారు. ఆధార్ సేవల కోసం 6300165036 ఈ ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి ఆధ్వర్యంలో 11 వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త)**
గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా ఐకెపి ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని దామెర, చింతలపల్లి, భావుపేట, కేశాపూర్, కోతులనడుమ తదితర గ్రామాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (సెర్ప్), ఐకెపి, విశాల సహకార బ్యాంక్ సంయుక్తంగా బుధవారం మొత్తం 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాయి.
మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వీటిలో మహిళా సంఘాల ద్వారా 6 సొసైటీలు, ఇతరంగా 5 సెంటర్లు ప్రారంభించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజీ, వైస్ చైర్మన్ స్రవంతి, స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ అబ్జలోద్దీన్, ఎంపీడీవో ఎన్. విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్‌కు ₹2,389, బీ గ్రేడ్‌కు ₹2,369 చెల్లిస్తున్నామని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడానికి ముందు బాగా ఆరబెట్టి, తాలు, మట్టి లేకుండా సిద్ధం చేయాలని సూచించారు.
ఐకెపి ఏపీఎం పి. కవిత మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు జరుగుతుందని, రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో దామెర సర్పంచ్ మంకని పద్మ, సూరారం సర్పంచ్ భాషబోయిన, చింతలపల్లి సర్పంచ్ బొంకురి రజిత, కోతులనడుమ సర్పంచ్ లింగయ్య, భావుపేట సర్పంచ్ రవీందర్ గౌడ్, కేశాపూర్ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఇందిరానగర్ సర్పంచ్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేన రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, ఐకెపి మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# మురళికి ఘన వీడ్కోలు

## పదవీ విరమణ సందర్భంగా సన్మానం.. సేవలకు ప్రశంసలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**




ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ వెంగల మురళి పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖలో విశిష్ట సేవలు అందించి సూపర్‌యాన్యుయేషన్ సాధించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
కార్యక్రమానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్, మండల విద్యాధికారి డా. బి. రామ్‌ధన్, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హసన్‌పర్తి హెచ్ఎం సుమాదేవి, జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ కాంప్లెక్స్ హెచ్ఎం కె.బి. ధర్మ ప్రకాశ్ హాజరై మురళి సేవలను కొనియాడారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను స్మరించుకున్నారు. జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, బాయ్స్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి మురళి, ఆయన సహధర్మచారిణి మాధవి దేవిని ఘనంగా సన్మానించారు. మురళి మాట్లాడుతూ బోధనా వృత్తి సమాజానికి సేవ చేయడానికి ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 100 మంది అవసరమైన విద్యార్థులను దత్తత తీసుకుని వారికి విద్యా సహాయం అందించనున్నట్లు తెలిపారు. "దీవెన" ట్రస్ట్ ద్వారా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తానన్నారు. జనగణమనతో కార్యక్రమం ముగిసింది.

# చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు- అంగన్వాడి కేంద్రాలు

**తల్లాడ/, ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు (చిన్నబ్బాయి) తెలిపారు. బుధవారం తల్లాడ మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను సర్పంచ్ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం చిన్నారులను ప్రేమగా పలకరిస్తూ ప్రశ్నలు అడిగి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు అంగన్వాడి కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడం వల్ల భవిష్యత్తులో



ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని అన్నారు. శూన్యం నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని, తల్లిపాలతో పాటు పోషకాహారం అందేలా చూసుకోవాలని సూచించారు. కేంద్రంలో అందిస్తున్న ఆహారంపై తల్లులను అడిగి తెలుసుకున్న సర్పంచ్, వారి సమస్యలను వినిపించుకున్నారు. అంగన్వాడి భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లులు వివరించగా, ఎన్టీఆర్ కాలనీలో అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలోనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
పోషణ్ పక్వాడ కార్యక్రమం 15 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఏసీడీపీవో నవ్య శ్రీ, సూపర్వైజర్ రోజా అరుణకుమారి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, అంగన్వాడి టీచర్ శైలజ, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# సేవలో ముందున్న లయన్స్ క్లబ్

## ఆరోగ్య శిబిరాలు.. ఈ-వెస్ట్ సేకరణ.. పాఠశాలకు సౌండ్ సిస్టం






**సత్తుపల్లి,/ ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
పర్యావరణ పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండే లయన్స్ క్లబ్ సభ్యులు బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. "ఎన్విరాన్మెంట్ వీక్"లో భాగంగా సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వాడుకలో లేని ఎలక్ట్రానిక్ పరికరాల (ఈ-వెస్ట్) సేకరణ చేపట్టి పర్యావరణంపై చైతన్యం కల్పించారు. వైరా కంటి వైద్య ఆసుపత్రి



సహకారంతో దుద్దిపూడి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డయాబెటిస్ పరీక్షలు కూడా చేసి గ్రామస్థులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్యాంబాబు సేవలందించారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి ప్రభుత్వ పాఠశాలకు రూ. 18 వేల విలువైన సౌండ్ సిస్టంను అందజేసి విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచారు. అలాగే విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్స్ విస్తరణ విభాగ బాధ్యులు మందపాటి ప్రభాకర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు గోగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిన మొక్కజొన్న పంట

**నర్సంపేట,/ ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**



నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో రైతు ఎండి భాషమియా పండించిన మొక్కజొన్న పంట విద్యుత్ తీగల షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. గ్రామ పరిసరాల్లో సాగు చేసిన సుమారు రెండు ఎకరాల మొక్కజొన్న చేను ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కాలిపోయింది. చుట్టుపక్కల రైతులు వెంటనే స్పందించి మంటలను ఆర్పినప్పటికీ అప్పటికే పంట పూర్తిగా నష్టపోయిందని రైతు భాషమియా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. విద్యుత్ లూజ్ లైన్ల కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే తన పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు ఎండి భాషమియా ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

**నర్సంపేట,/ ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణ పరిధిలోని 9వ వార్డుకు చెందిన ఆకుతోట కళావతి కుటుంబానికి మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ముఖ్య అతిథిగా హాజరై, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి నివాసం కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి విడతల వారీగా ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ఇది ప్రజా



ప్రభుత్వం అని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులు శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌ను శాలువాతో సత్కరించి



కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, కాంగ్రెస్ యువ నాయకులు మెర్గు కిరణ్, ఉప్పుల శాలూమ్, దేవోజు హేమంత్, మైదం రాకేష్, చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు.

# మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో ఘనంగా సక్సెస్ ఫెస్ట్ వేడుకలు




**సత్తుపల్లి/ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**




సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్‌లో ఉన్న మిరాకిల్ మైండ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సక్సెస్ ఫెస్ట్ (రిజల్ట్ డే) వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ఫలితాలను ప్రతిబింబించే ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నక్క రాజేశ్వరరావు, న్యూ స్టార్ హాస్పటల్ డాక్టర్ రామాల సురేష్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తమమైన బోధన అందిస్తున్నారని కొనియాడారు. పాఠశాలలో వేదిక్ మాథ్స్, అబాకస్, ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్, ఏఐ టెక్నాలజీ, ఎల్‌ఈడి డిజిటల్ క్లాసెస్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా జూన్ నెల ప్రారంభం నుంచి ఏప్రిల్ నెల వరకు విద్యార్థులు సాధించిన ప్రతిభను వారు అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మొండ్రు రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ గీత, డీన్ వాణి, ఏవో మురళి, ఇంచార్జ్ మహేష్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖర్గే వ్యాఖ్యలు అప్రజాస్వామికం: పొంగులేటి ఫైర్

## మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ - తమిళనాడులో ఎన్డీయే విజయం ఖాయం అంటూ ధీమా

**ఖమ్మం/ఏప్రిల్ 22 (జర్నలిస్ట్ వార్త):**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికమని బీజేపీ జాతీయ నాయకులు, కర్ణాటకతమిళనాడు ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆయన, ఖర్గే వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. దేశ సార్వభౌమత్వం కోసం కృషి చేస్తున్న ప్రధానిని 'ఉగ్రవాది'గా అభివర్ణించడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఖర్గే తక్షణమే దేశ ప్రజలకు, ప్రధానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



తమిళనాడు శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించానని పొంగులేటి తెలిపారు. ప్రజల్లో మార్పు కోరిక స్పష్టంగా కనిపిస్తోందని, మోదీ నాయకత్వంపై అపారమైన విశ్వాసం ఉందని చెప్పారు. ఎడప్పాడి పళనిస్వామి సారథ్యంలో ఎన్డీయే కూటమి అఖండ మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ద్రవిడ మున్నేట్ర కజగం అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఈ ఎన్నికల్లో దానికి ముగింపు పలుకుతారని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు రక్షణ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'ద్రావిడియన్ మోడల్' పేరుతో అక్రమాలు, అరాచకాలు పెరిగాయని ఆరోపించారు. తిరువణ్ణామలై వంటి పవిత్ర క్షేత్రాల్లో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కుటుంబ పాలనతో రాష్ట్ర ఖజానాను దోచుకుంటూ అభివృద్ధిని పక్కనబెట్టారని విమర్శించారు.

ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తుచేసిన పొంగులేటి, ఉగ్రవాద రహిత భారత్ కోసం మోదీ తీసుకుంటున్న కఠిన నిర్ణయాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అన్నారు. అలాంటి నాయకుడిని ఉగ్రవాదితో పోల్చడం ద్వారా కాంగ్రెస్ ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ, ఎం.కే. స్టాలిన్ ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌డీఎంకే కూటమి కేవలం అధికార దాహంతో ఏర్పడిన అపవిత్ర కలయిక అని ఎద్దేవా చేశారు. బీజేపీ మేనిఫెస్టో 'వికసిత భారత్' లక్ష్యంతో రూపొందించబడిందని, పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని కొనియాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని కూడా పొంగులేటి విమర్శించారు. రేవంత్ రెడ్డి సర్కారు ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం వంటి పథకాలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కదలని బస్సులు

## - ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు







**సత్తుపల్లి/ఏప్రిల్ 22 (జర్నలిస్టు వార్త):**సత్తుపల్లి ఆర్టీసీ బస్ స్టాండ్‌లో కార్మికుల సమ్మె ప్రభావం బుధవారం తీవ్రంగా కనిపించింది. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె కారణంగా డిపోలోని బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బస్సులు నడుస్తాయని భావించి బస్ స్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులు నిరాశకు గురయ్యారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమ్మెకు అద్దె బస్ డ్రైవర్లు కూడా సంఘీభావం ప్రకటించడంతో బస్సులు డిపో నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఉదయం వేళలో కొంత ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం సమ్మె శాంతియుతంగా కొనసాగుతోంది. ముందస్తు సమాచారం నేపథ్యంలో ఇతర రాష్ట్రాల బస్సులు కూడా సత్తుపల్లి ప్రాంతానికి రాకపోకలను నిలిపివేశాయి. బస్ స్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు మాట్లాడుతూ, త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని, రాష్ట్ర ప్రభుత్వం మరియు ఆర్టీసీ కార్మికులు చొరవ తీసుకుని సమ్మెకు ముగింపు పలకాలని కోరారు. సత్తుపల్లి ఆర్టీసీ బస్ స్టాండ్‌లో సమ్మె పూర్తిస్థాయిలో కొనసాగుతోంది.

# నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును వేగంగా ఢీకొన్న కారు -ముగ్గురు దుర్మరణం

**నల్గొండ,ఏప్రిల్ 22(జర్నలిస్ట్ వార్త):**
నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆర్ టీ సి కార్మికుల న్యాయమైన డిమాండ్ లను రాష్ట్ర ప్రభుత్వ అమలు చేయాలని కోరుతూ

# బీజేపీ సత్తుపల్లి పట్టణ శాఖ ఆధ్వర్యం లో ఆర్ టి సి కార్మికుల సమ్మె కు మద్దతు



**సత్తుపల్లి/ఏప్రిల్22(జర్నలిస్టు వార్త):**
రాష్ట్ర వ్యాప్తం గా తమ న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ బుధవారం టీజి ఆర్టిసి కార్మికుల సమ్మె బాటపట్టారు. అందులో భాగంగా సత్తుపల్లి ఆర్ టి సి డిపో ఎదురుగా ఉదయం నుంచే బస్సుల రాకపోకలను నిలిపివేస్తూ ఆర్ టీ సి కార్మికులు తమ విధులను బహిష్కరించారు. వారియొక్క న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సత్తుపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షులు బానోతు విజయ్ ఆధ్వర్యం లో సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి పాల నాగాసురెందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ఆర్ టి సి కార్మికులు 54 రోజులు నిరవధికంగా సమ్మె చేశారని అప్పటి ప్రభుత్వపెద్దలు కార్మికుల డిమాండ్స్ ను పరిశీలించి అమలుకు సిద్ధం గా ఉన్నామని కల్లబొల్లి మాటలతో సమ్మెను విరమింపచేశారు. కానీ అప్పటి నుండి ఏ ఒక్క డిమాండ్ ను అమలు చేయలేదు. కార్మికుల సమస్యలను లేవనెత్తకుండా కార్మిక సంఘాలను పుట్టుక నిలిపి వేశారు. 2017 లో చెల్లించాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదు. 2021,



2025 పే స్కేల్ అమలు కాలేదు. ఆర్ టీ సి నీ ప్రభుత్వం లో విలీనం చేయలేదు. ఔట్ సోర్స్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆర్ టి సి కార్మికుల న్యాయమైన డిమాండ్స్ అమలు జరిగేవరకు సమ్మె కొనసాగించాలని అన్నారు. బీజేపీ ఆర్ టి సి కార్మికుల పక్షాన పోరాడేందుకు సిద్ధం గా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ ప్రధాన కార్యదర్శి మందా శివ, సీనియర్ నాయకులు చీకటి వసంతరావు, పెద్దిరాజు, బట్టి శివ సాయి యాదవ్, ఆర్ టి సి కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

